యూనిట్ IV

# 10. బాలవాఙ్మయము

- ఎల్లోరా

**ఆలోచించండి-మాట్లాడండి**



తళతళ మెరుపులు
ఫెళఫెళ ఉరుములు
జలజల వానలు కురియగనే...
బిలబిల రైతులు
బిరబిర వచ్చి
నాటులు వేసిరి పొలములలో...
కలకల కంకులు
గలగల గింజలు
చక చక పంటలు పండినవీ...
పాలూ, బియ్యం
బెల్లం వేసి
పాయసమొండెను మా అమ్మ!
గిన్నెలు లేవు
దొన్నెలు చేసి
పంచుకు తిందాం రారండీ!
కలసి ఉందాం రారండీ!!

**ప్రశ్నలు:**

1. ఈ గేయం దేన్ని గూర్చి తెల్పుతుంది?
2. ఈ గేయం పిల్లలు పాడుకొనేదా? పెద్దలు పాడుకొనేదా?
3. దీనిలో జంటపదాలను గమనించారా? ఇలాంటివి మరికొన్ని చెప్పండి.
4. పిల్లల పాటలు ఉన్న సాహిత్యాన్ని ఏమంటారు?

**ఉద్దేశం:** పసిపిల్లలు ఇప్పుడే విరిసిన పువ్వుల లాంటి వారని, ఆటపాటలతో వీరిని తీర్చిదిద్దితే వారిలో జాతీయతా సుగంధాలు పరిమళిస్తాయని అని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.
ఈ పాఠ్యభాగం ఎల్లోరా రచించిన 'జానపద వాఙ్మయం' అనే గ్రంథం నుంచి తీసుకొన్నది.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



బాలవాఙ్మయానికి కర్తృత్వం వహించేది తల్లి హృదయం. తెలుగు తల్లులు తమ పాపలకు ఉగ్గు పాలతో పాటు ఆటపాటలూ, కథలూ, గాథలూ నేర్పడంతో పాటు కావ్యరసాన్నీ, భక్తిరసాన్నీ కూడా రంగరించిపోశారు.

బాలలకు ప్రపంచంతో నిమిత్తం లేదు – కాని, భవిష్యత్తు తమదే. తమకు ఈర్ష్యాద్వేషాలు, కులమతాలు, హెచ్చుతగ్గులతో సంబంధంలేదు. అందుకే వారి చేష్టలు, గంతులు, పలుకులు ఆటలూ–పాటలూ ఏ ఒక్కరికో అందం అనిపించి, ఆనందం కలిగించి మకరందం కుమ్మరించేవి కావు. పిల్లల ఆట పాటలకూ, చిలిపితనపు చిట్టి పనులకు, తేనె చినుకుల యక్షప్రశ్నలకు మురియని హృదయం, చూడని, వినని, సంతోష పడనివారు ఎవరు?



ఆటంబాంబులను గురించిన ఆలోచనలు వారికి ఉండవు. భయం, కుట్ర వారికి సంబంధించినవి కావు. లేదని బెంగా? ఉందన్న గర్వమా? అవి ఏవీ వారికి తెలియని విషయాలు! తినడం, ఆడుకోడం, పాడుకోడం – హాయిగా తల్లిఒడిలో, జోలపాటల కమ్మదనంలో నిద్రపోవడం – ఇవే వారి ప్రపంచం విషయాలు – ఇవే వారి మనోభావ మందారాలు!!

బాలురు, బాలికలు – వీరు విడివిడిగా ఆడుకొంటూ పాడుకొనేవి, కలిసిపాడుకొనేవి, ఆడుకొనేవి కూడా చాలా ఆటపాటలు ఈ బాలవాఙ్మయంలో ఉన్నాయి.

చెడుగుడు ఆట, ఆకు ఆట, కోతికొమ్మచ్చి ఆటలు, వాటికి సంబంధించిన పాటలూ బాలుర సొత్తు. బుజబుజరేకుల పెండ్లి ఆటపాట, ఉయ్యాలాట, తూరుతే పిల్లి, గొబ్బిళ్ళు మొదలయిన ఆటలూ వాటి పాటలూ బాలికలదే కాపీరైటు హక్కు!!

ఈ ఆటల్లో, పాటల్లో పురాణగాథలు, జానపద కథలు, నీతులు, ఆరోగ్య విషయాలు, ఆయుర్వేద రహస్యాలు భవిష్యత్ రథ సారథ్యానికి పరుగులు. భవిష్యత్ ప్రయాణానికి దారులు ఎన్నో ఉన్నాయి.

మన ప్రాచీన వాఙ్మయంలో ఆటలను పేర్కొన్నారు. వినండి! పాటల ద్వారా ఆటలు – ఆటల ద్వారా పాటలు – ఈ రెండింటి సమ్మేళనం ద్వారా శారీరక బలం, విజ్ఞాన హేతువుకూడా!

పూర్వకాలపు పిల్లల గేయాలను ఎవరు రచించారో. తెలియదు కాని, ఆ పాటలు మన తెలుగు నేల నాలుగు చెరగులా ప్రతి తల్లి నోటా కంఠస్థమై ప్రచారానికి వచ్చాయి. ఈ పాటలు అనేక రీతులలో అనేక ప్రబోధిత రూపాలలో రచించి ఉన్నాయి. పూర్వకాలపు బాలసాహితిలో ఎంత తేలిక భాష వాడారో గమనించండి. ఒక్కొక్క పనికి, ఆటకు ఒక్కొక్క పాట, లేచింది మొదలు పడుకొనే వరకు జరిపే ప్రతి పనికి ఈ పాట – పనివిలువను ప్రతిబింబిస్తుంది. అటువంటి వాటిలో కొన్ని పరిచయం చేస్తాను.



ఉదయాన్నే చంటి పిల్లవాడు లేస్తాడు. అలా లేచీ లేవడంతోనే మన ఇళ్ళల్లో తల్లిపాలతో కలిపిన ఆముదం (ఉగ్గు) పెట్టడం పరిపాటి. ఉగ్గుపెట్టే సమయంలో పాడే ఈ పాటలు చూడండి.

"జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం
గుర్రాలు తిన్న గుగ్గిళ్ళు జీర్ణం....."

అంటూ ఉగ్గుతోపాటు పాతకథలను రంగరించి బోధించి, ఆఖరున

అబ్బాయి తాగిన పాలూ, ఉగ్గూ జీర్ణమై
కుంది లాగ కూర్చుని – పందిలాగ పాకి
లేడిలాగ లేచి – నందిలాగ నడిచి
తాంబేలు లాగ......."

అంటూ తనకొడుకు పైవాటిలాగా పుష్టి కలిగి ఆరోగ్యవంతుడుగా అవ్వాలని, ఆ తల్లి తన దీవెనలను పాటరూపంలో పాడుతుంది.

అక్కడి నుంచి స్నానానికి తీసుకువెళతారు పాపని.

"అమ్మకడుపు చల్లగా అత్తకడుపు చల్లగా
లెక్కలేని సొమ్మెట్టుకొని పుట్టులేని బట్టకట్టి
అనుమూ తనుమూ మునిమనుమలతో వర్ధిల్లాలి"

అంటూ తలకు నూనె పెడుతూ దీవిస్తారు. అటు అత్తగా పెంపూ, ఇటు పుట్టింటి పెంపూ సుఖంగా ఉండి ఆయురారోగ్యాలతో వర్ధిల్లమని.

స్నానం పూర్తయ్యాక తల తుడిచి – కాళ్ళ మీద కూర్చోబెట్టుకొని ఆడిస్తూ పాడే పాటలు వినండి.

"గుమ్మాడమ్మా! గుమ్మాడీ!
ఏ వూరు వెళ్ళింది! గుమ్మాడీ!
ఏం తెచ్చింది! గుమ్మాడీ!
వేలూరు వెళ్ళింది! గుమ్మాడీ!
వెలక్కాయ తెచ్చింది గుమ్మాడీ!"

అంటూ ఆడిస్తూ ఊపుతారు. అలా ఊపుతూ పాటలు పాడుతూ ఉంటే చక్కగా నిద్రపోతారు పిల్లలు. అప్పుడు ఉయ్యాలలో పడుకోబెట్టి చక్కగా పాడుతూ ఊపుతారు. ఆ సమయంలో పాడే పాటలని లాలిపాటలనీ; – జోల పాటలనీ; – ఉయ్యాల పాటలనీ వ్యవహరిస్తారు. ఈ పాటలు సరైన వరసలలో చక్కని గొంతుతో పాడుతుంటే ఆ సమయంలో పెద్దవాళ్ళకే కునుకుపాట్లు వస్తాయంటే ఆశ్చర్యం లేదు.

ఒకవేళ ఎంత ఊపినా నిద్రపోక చంటి పిల్లలు ఏడుస్తూంటే పాడే ఈ పాటలో పాపమీద ఉండే బలమైన ప్రేమకొద్దీ

తల్లి – ఏడవకు ఏడవకు వెర్రిపాపాయి!
ఏడిస్తె నీ కళ్ళు నీలాలుగారు!
నీలాలు గారితే నే చూడలేను...

అంటూ తన ప్రేమను వెలిబుచ్చుకొని – కన్నబిడ్డ కనుల నీరు పెట్టడం చూడలేక పాలైన కారవే బంగారు కళ్ళూ..." అని వాపోతుంది



అలాగే ఈ గేయం పరికించండి–

పిల్లరావే! తల్లి పిల్లలకు
నీళ్ళోసి పల్లెలకు పంపి....."

అన్న పాటలో ఎంత ఆనందముందో? చంటిపాపడిని చూసి, ఎప్పుడు పెద్దవాడవుతాడా అని ఉవ్విళ్ళూరే తల్లి సంతోషం పట్టలేక–

ఆడి రాగా ముద్దు వాడి రాగా ముద్దు
నట్టింట అబ్బాయి నడవంగ ముద్దు..."

అనుకుంటుంది – అంతకంటే మాతృహృదయం ఏం కోరుకుంటుంది చెప్పండి.

ముసలితనంలో కదల నవసరం లేకుండా ఉండే పని – పిల్లలను ఆడించడమొక్కటే, పిల్లలను దగ్గర కూర్చోపెట్టుకొని ఆటల రూపంలో పాడే ఈ పాటలు గమనించండి.

కాళ్ళా గజ్జె గంగానమ్మ!
వేగూ చుక్కా! వెలగా మొగ్గా!...

అంటూ ఆడిస్తారు.

ఈ ఆటపాటల్లో చక్కని శారీరక వ్యాయామం కూడా వుంది. ఇదే పద్ధతిలో పాడే ఈ పాటలు వినండి.





©SCERT not to be republished

తప్పెట్లోయ్ తాళాలోయ్
దేవుడిగుళ్ళో బాజాలోయ్....

అంటూ ఆడించి

మా పాపకు పాలూ ఉగ్గూ అంటూ నవ్విస్తారు...

అలాగే ఈ పాట వినండి.

"ఒక్కా ఓ చెలియా! – రెండు రోకళ్ళు
మూడు ముచ్చిలకా! – నాలుగు నందన్నా
అయిదూ చిట్టి గొలుసు! – ఆరు జవ్వాజి
ఏడుం బేడీలు! – ఎనిమిది వెన్నముద్ద
తొమ్మిది తోపచ్చు! – పది ఏటిలేడు..."

అనే ఈ పాట అంకెలు నేర్పడానికి చాలా ఉపయోగిస్తుంది. అలాగే చంటిపాపకు అన్నం తినిపించే సమయంలో ఏ వెన్నెల కాంతిలోనో ఉండి చందమామను చూపిస్తూ పిల్లవాడిని మాయపెడుతూ ఈ పాటలు పాడుతారు. ఈ పాటలు వింటుంటే మన చిన్నతనం కళ్ళముందు కనిపించడం లేదంటారా?

"చందమామ రావే! – జాబిల్లి రావే!
కొండెక్కి రావే! – కోటిపూలు తేవే!
పైడి గిన్నెలో పాలు పోసుకుని
వెండి గిన్నెలో పెరుగు పోసుకుని
ఒలవని పండు ఒళ్ళో వేసుకు
ఒలచిన పండు చేత్తో పట్టుకు
అలా అలా తిరిగొచ్చి అమ్మాయికియ్యవే!...."

ఈ పాట పాడుతూ, మధ్యమధ్యన కబుర్లు చెబుతూ అన్నంపెడితే ఎంత అల్లరి పాపలైనా ఇట్టే బువ్వ తినేస్తారు.

అలాగే పసిపాపలకు – తొక్కు పల్కులని సంభాషణ రావడానికి, నోరు సులువుగా తిరగడానికీ ఈ పలుకులు నేర్పుతారు.

"ధిమిత ధిమిత – ఏమి ధిమిత?
పసుపు ధిమిత!
ఏమి పసుపు? – ఛాయపసుపు...

ఇలాంటి పాటలు చాలా ఉన్నాయి.

అలాగే బాలురలో చిన్నతనం నుంచీ పరిశీలనాపటిమను అభివృద్ధి చేయటానికి పనికివచ్చే ఈ పాటను పరిశీలించండి.



"వీరి వీరి గుమ్మడి పండు! – వీరిపేరేమి?
దాగుడు మూతా – దండాకోర్!
పిల్లీ వచ్చే ఎలకా భద్రం
ఎక్కడి దొంగ లక్కడికే
గప్ చిప్ సాంబారు బుడ్డి..."



ఈ పాట వ్యాయామాన్ని పరిశీలన సామర్థ్యాన్ని కూడా పాపలకు అందిస్తుంది. ఇంతేకాదు. ఈ రకాలైన బాలలపాటల్లో కొన్ని ఆయుర్వేద రహస్యాలు కూడా ఉన్నాయని అంటారు. మచ్చుకు!

"కొండ మీది వెండిగిన్నె
కొక్కిరాయి కాలు విరిగె
దానికేమి మందూ?...."

అని ప్రశ్నించి...

"వేపాకు చిగురు – వెల్లుల్లిగడ్డా
నూనెమ్మ బొట్టు – నూటొక్కసారీ
పూయవోయి నూరి – పూటకొక్కతూరీ..."

అని సమాధానం ఇస్తుంది. ఇటువంటి ప్రథమ చికిత్సా ప్రబోధితాలయిన పాటలు ఇంకా ఎన్ని ఉన్నాయో కదా?



©SCERT not to be republished

**కవిపరిచయం:**



1. కవిపేరు : గొడవర్తి భాస్కరరావు
2. కలంపేరు : ఎల్లోరా
3. జన్మస్థలం : తూర్పు గోదావరి జిల్లా, ముంగండ గ్రామం.
4. కాలం : 20వ శతాబ్దం
5. రచనలు : జానపద గేయాలు, జానపద సాహిత్యం, రేపటి వసంతం, నిశ్శబ్ద తరంగాలు మొ॥నవి.
6. సత్కారాలు : ఆం.ప్ర.సాహిత్య అకాడమీ అవార్డు పొందారు.

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. ఈ పాఠం దేన్ని గురించి చెప్తోంది?
2. బాలవాఙ్మయం అంటే ఏమిటి?
3. మీ ఇంటిలో పెద్దలు మీ చిన్నతనంలో ఏఏ పాటలు పాడి మిమ్మల్ని ఆడించేవారు? (మీ మాతృ భాషలోనివి / ఇతర భాషలలోనివి)
4. పాఠంనుంచి మీరు ఏం తెలుసుకున్నారు?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. కింది వాక్యాలలోని భావాలు ఏఏ పాటల్లో ఉన్నాయో రాయండి.

అ) పిల్లలు తిన్న ఆహారం జీర్ణం కావాలి ______________.

ఆ) మునిమనమలతో వర్ధిల్లాలి ______________.

ఇ) పిల్లలు ఏది చేసినా ముద్దే ______________.

ఈ) పసిపిల్లలకు నోరు సులువుగా తిరగడానికి ______________.

ఉ) అంకెలు నేర్పడానికి చెప్పేపాట ______________.

2. పాఠం చదవండి. కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

అ) బాలవాఙ్మయం ఎందుకు పుట్టింది?

ఆ) ఈ పాఠానికి ఇంకో శీర్షిక పెట్టండి. ఎందుకు ఆపేరు పెట్టవచ్చో వివరించండి.



ఇ) పెద్దవారు ఇళ్ళలో ఏమి చేస్తుంటారు?

ఈ) పిల్లలు ఎలాంటివారు?

ఉ) పూర్వకాలపు పిల్లల పాటల గురించి మీ అభిప్రాయమేమిటి?

3. కింది పదాలు చదవండి. అవి ఏ వాక్యాలలో ఉన్నాయో ఆ వాక్యాలు రాయండి.



అ) తల్లి హృదయం

ఆ) సొత్తు

ఇ) నేలనాలుగు చెరగుల

ఈ) పని విలువ

ఉ) కళ్ళముందు

4. పాఠం రెండో పేరా చదవండి. దానికి ప్రశ్నలు తయారుచేయండి.

అ)

ఆ)

ఇ)

ఈ)

5. ఈ కింది పద్యానికి శీర్షిక నిర్ణయించండి. అది ఎలా సమర్ధనీయమో చెప్పండి.

కంఠమెత్తి నీవు గంభీరముగ పాడు
తోడి వారగలసి ఆటలాడు
ఆట పాటలందు ఆరోగ్యముందిరా!
భవ్య సుగుణ శీల! భరతబాల!



6. ఈ కింది వాక్యానికి సమానార్థాన్నిచ్చే వాక్యాన్ని గుర్తించండి.

అ) భోజనం మధ్యలో నీరు తాగగూడదు.

(i) భోజనం ప్రారంభించాక నీరు తాగవచ్చు. ( )

(ii) భోజనం చివరలో నీరు తాగవచ్చు. ( )

(iii) భోజనం ప్రారంభించాక చివరి వరకూ నీరు తాగరాదు. ( )

(iv) వీటిలో ఏదీ కాదు. ( )

7. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా సమాధానాలు రాయండి.

అ) అంకెలు నేర్పడానికి ఏ పాట ఉపయోగపడుతుంది?

ఆ) బాలల పాటల్లో ఆయుర్వేద రహస్యాలు ఎలా చెప్పారు?

ఇ) పిల్లలకు ఏఏ విషయాలు తెలియవు?

ఈ) పూర్వకాలపు బాలసాహితిలో ఎలాంటి భాషను వాడారు?

ఉ) పిల్లవానికి ఉగ్గుపెట్టే సమయంలో ఏ పాట పాడతారు?

ఊ) చంటిపిల్లలు ఏడుస్తుంటే ఏ పాట పాడతారు?



## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**


అ) పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ) బాలవాఙ్మయాన్ని మనం ఎందుకు తెలుసుకోవాలి?

ఇ) "పల్లెలలో, బాలవాఙ్మయం ఇంకా బతికి ఉంది" దీనిపై మీ అభిప్రాయం చెప్పండి.

ఈ) ప్రాచీన బాలవాఙ్మయం తల్లులు, పెద్దలు కర్తృత్వం వహించేవారు గదా! ఇప్పుడు దాని స్థానాన్ని ఏవి ఆక్రమించాయి?

ఉ) పిల్లల సొత్తు ఏదని మీరనుకుంటున్నారో మీరు వివరించండి.



**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) బాలసాహిత్యం ఆవశ్యకతను వివరించండి.

ఆ) బాలల పాటలను గురించి ఉదాహరణలు రాయండి.

ఇ) చిన్నతనంనుంచి ముసలి వాడయ్యేవరకు మనవెంట బాలసాహిత్యం ఎలా అంటిపెట్టుకొని ఉంటుంది?

ఈ) ఈ పాఠ్యభాగ రచయితను గురించి రాయండి.

## IV. పదజాలం



**1. కింది జంటపదాలను జతపరచండి.**

| | | | | |
|---|---|---|---|---|
| అ) | ఆట | 1) | ద్వేషాలు | (   ) |
| ఆ) | కథలూ | 2) | మతాలు | (   ) |
| ఇ) | ఈర్ష్య | 3) | తగ్గులు | (   ) |
| ఈ) | కుల | 4) | తాళాలు | (   ) |
| ఉ) | హెచ్చు | 5) | తునుము | (   ) |
| ఊ) | తప్పట్లు | 6) | పాటలు | (   ) |
| ఋ) | అనుము | 7) | గాధలు | (   ) |



**2. పాఠంలోని 'లు'తో అంతమయ్యే బహువచన పదాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**



సొంతవాక్యం

ఉదా: ఆటలు : ఆటలాడడం వల్ల ఆనందం కలుగుతుంది.

_______ : ______________________

_______ : ______________________

_______ : ______________________


_______ : ______________________


_______ : ______________________

_______ : ______________________

_______ : ______________________

**3. పాఠంలోని పదాలతో కింది చక్రాన్ని పూరించండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**






ఉదా : నందిలాగ నాలుగేళ్ళు జీవించినా చాలు.

అ) ______________________

ఆ) ______________________

ఇ) ______________________

ఈ) ______________________

ఉ) ______________________






**4. కింది గళ్ళలోనున్న ఆటలను గుర్తించి రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| కో | చిం | త | మూ | గు |
| తి | త | లు | డు | దా |
| కొ | గిం | జ | లు | గు |
| మ్మ | చె | మ్మ | ప | రు |
| చ్చి | కు | ర్రీ | చె | క్క |

ఉదా : కోతి కొమ్మచ్చి





## V. సృజనాత్మకత



**కింది వానిలో ఒకదానిని చేయండి.**

అ) ప్రాచీనమైన ఆటలను, పాటలను సేకరించి గోడపత్రికలో ఉంచండి.

ఇ) 'మన ఆటలూ' అనే శీర్షికతో ఒక వ్యాసం రాయండి.

## VI. ప్రశంస



**కింది వానిలో ఒకదానిని చేయండి.**

అ) బాలవాఙ్మయ పాఠ్యరచయిత ఎల్లోరాగారిని ప్రశంసిస్తూ, పత్రికలకు లేఖరాయండి.

ఆ) మీరు ఆడే పాత ఆటలను సేకరించి వాటిని పరిరక్షించాలని క్రీడలమంత్రికి లేఖ రాయండి.

## VII. భాషాంశాలు



**1. కింది పదాలను విడదీయండి.**


| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ రాముడతడు | = | రాముడు + అతడు | = | (డ్ +) ఉ + అ = డ |
| అ) అతడెక్కడ | = | __________ | = | __________ |
| ఆ) మనమున్నాము | = | __________ | = | __________ |
| ఇ) మనసైన | = | __________ | = | __________ |
| ఈ) ఎవరిచ్చారు | = | __________ | = | __________ |

హ్రస్వ 'ఉ' కారానికి (ఉత్తు' కు) అచ్చు కలిసినప్పుడు, ఉకారం లోపించి, పరాచ్చు నిలుస్తుంది. దీన్నే **"ఉత్వసంధి"** అంటారు.

**'ఉత్తు'**కు 'అచ్చు' పరమైనప్పుడు సంధి నిత్యం. ('నిత్యం' అంటే తప్పక జరుగుతుంది అని అర్థం).



**2. ఈ కింది పదాలను కలిపి, మార్పును చర్చించండి.**



| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఉదా॥ ఏనాడు + ఏ శిల్పి | = | (డ్ +) ఉ + ఏ | = | డే | = | ఏనాడే శిల్పి |
| అ) గోపురము + అది | = | __________ | = | _____ | = | _____ |
| ఆ) మోగును + అంట | = | __________ | = | _____ | = | _____ |
| ఇ) కొనసాగవు + ఇపుడు | = | __________ | = | _____ | = | _____ |
| ఈ) మలినము + ఐన | = | __________ | = | _____ | = | _____ |
| ఉ) లంచాలు + ఇచ్చారు | = | __________ | = | _____ | = | _____ |

### ప్రాజెక్టు పని

మీ అమ్మమ్మ / నానమ్మ / తాతయ్యలు లేదా వారి వయసు ఉండే పెద్దవాళ్ళను అడిగి వాళ్ళ చిన్నప్పుడు ఆడిన ఆటలను గురించి తెలుసుకొని వాటిని చార్టుమీద రాయండి.



### నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | బాలవాఙ్మయము గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | భావాలకు అనుగుణంగా గేయాలను గుర్తించగలను. | ఔను / కాదు |
| 3. | బాలసాహిత్యం గురించి, బాలల గేయాల గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | ప్రశంసా పూర్వకమైన లేఖలు రాయగలను. | ఔను / కాదు |

*"అసహనం మనిషి ప్రగతికీ, స్నేహానికీ అవరోధం."*



©SCERT not to be republished